క్లుప్తంగా

ఐమాస్ట్ లైట్లకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..



వేపకుంట్లలో వెలుగుతున్న హైమాస్ట్ లైట్లు

రఘునాథపాలెం: వేపకుంట గ్రామ చౌరస్తాలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ వీధిలైట్లు నెలల తరబడి పనిచేయక స్థానికులు రాత్రిపూట అంధకారంలో మగ్గుతున్నారు. దీనిపై సాక్షిలో దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మరమ్మతులు చేయించి వెలుగులు నింపేలా చర్యలు తీసుకున్నారు. దీంతో గ్రామస్తులు అధికారులకు, సాక్షి పత్రికకు ధన్యవాదాలు తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నేలకొండపల్లి: మండలంలోని సింగారెడ్డిపాలెం అరవిందా పాఠశాల పూర్వ విద్యార్థులు(పదో తరగతి 2001 బ్యాచ్) ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణమంతా కలియతిరిగి గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో తేజావత్ కోటయ్య, వడ్డె అన్వేష్, ఆజాద్, గంగాధర్, సైదారావు, వీరబాబు, ఎల్.రవి, ఉప్పు వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, లింగరాజు, నాగుల్‌మీరా, త్రివేణి, రేణుక, సంధ్య, జ్యోతి, నర్మదా తదితరులు పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

కామేపల్లి: మండలంలోని పింజరమడుగు చిన్న చెరువులో విషప్రయోగం చేసిన నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని మత్స్య సహకార సొసైటీ సభ్యులు డిమాండ్ చేశారు. చెరువు వద్ద మృతి చెందిన చేపలను చూసి వారు ఆవేదన చెందారు. కష్టపడి పెంపకం చేస్తున్న చేపలను కొందరు కక్షపూరితంగా చెరువులో మందు కలిపారని అన్నారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని కోరారు.

కళాసిల్క్‌లో 65 శాతం డిస్కౌంట్



వస్త్రాలు కొనుగోలు చేస్తున్న మహిళలు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని టీటీడీ కల్యాణ మండపంలో హైదరాబాద్‌కు చెందిన కళాసిల్క్ చేనేత హస్త కళా, చేనేత వస్త్ర ప్రదర్శన మహిళలను ఆకట్టుకుంటుంది. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, కాంతావర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్ శారీస్, లెనిన్ శారీస్, కలం బెంగాల్ కాటన్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ జాకెట్లు, లక్నో చికాన్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యూయలరీ వంటి వాటిని 65శాతం డిస్కౌంట్‌తో 14 నగరాలకు చెందిన ఉత్పత్తులను విక్రయిస్తున్నామని నిర్వాహకులు వినోద్ జైన్ తెలిపారు.

మత్స్యకారులపై నిర్లక్ష్యం

రఘునాథపాలెం: ప్రభుత్వం మత్స్యకారులను నిర్లక్ష్యం చేస్తున్నారని తెలంగాణ ముదిరాజ్ యువసేన ఓ ప్రకటనలో ఆరోపించారు. చెరువులు నిండు కుండలుగా ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేయాల్సిన చేప పిల్లలను సమయానికి అందించకపోవడంతో మత్స్యకారుల ఆదాయానికి తీవ్ర ఆటంకం కలుగుతున్నందున అధికారులు చేప పిల్లల పంపిణీకి బదులు నగదు బదిలీ చేయాలని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లేళ్ల లక్ష్మణ్ ముదిరాజ్ అధ్యక్షతన ముదిరాజ్ యువసేన నేతలు హెచ్చరించారు.

ఫొటోగ్రాఫర్‌కు తీవ్ర గాయాలు

నేలకొండపల్లి: మండల కేంద్రానికి చెందిన ఫొటోగ్రాఫర్ కై లాసపు రేణుకుమార్ ఆదివారం తన బైక్‌పై వెళ్తుండగా.. రామాలయం సమీపాన అదుపు తప్పి కిందపడ్డాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలుకావడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి, ఆపై ఖమ్మం తరలించారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ఓజీ
వినోద	ఓజీ
సాయిరాం	ఓజీ
ఆదిత్య	ఓజీ, మిరాయ్
శ్రీనివాస	ఓజీ

- ఖమ్మంవ్యవసాయం

ఇక అంతా లెక్క ప్రకారమే..

- ప్రక్షాళన దిశగా వీధి వ్యాపారుల ప్రాంగణం
- అద్దె ప్రాతిపదికన దుకాణాల కేటాయింపు
- వ్యాపారుల వివరాలు సేకరిస్తున్న మెప్మా అధికారులు
- దళారులు, నాయకుల జోక్యం తగ్గించేందుకు కసరత్తు



వీధి వ్యాపారుల ప్రాంగణంలో వ్యాపారులతో మాట్లాడుతున్న మెప్మా అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని వీధులు, రోడ్ల వెంట తోపుడుబండ్లపై వ్యాపారాలు చేసుకునే వీధి వ్యాపారుల కోసం లక్షలాది రూపాయలను ఖర్చు చేసి పాత బస్టాండ్ ఎదురుగా వీధి వ్యాపారుల ప్రాంగణాన్ని నిర్మించారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యాన గత ప్రభుత్వ హయాంలోనే ఈ ప్రాంగణం నిర్మించినా.. ఇటీవల దీనిని ఆధునీకరించారు. ఇక్కడ కూరగాయలు కొనుగోలు చేసే వారి సంఖ్య భారీగా పెరగడం, ఈ ప్రాంగణం నిత్యం రద్దీగా మారడంతో కొంత మంది అడ్డదారిలో దుకాణాలను పొందారనే విమర్శలు ఉన్నాయి. కొంత మంది ప్రజాప్రతినిధులు, నాయకులు వీరి వద్ద మామూళ్లు తీసుకొని మరీ వీరిని ఇక్కడ వ్యాపారాలు చేసుకునేందుకు అనుమతించారనే ఆరోపణలు ఉన్నాయి. ఒకే కుటుంబానికి చెందిన వారికే నాలుగైదు దుకాణాలు ఇవ్వడం, స్థానికేతరులు ఈ ప్రాంగణంలో వ్యాపారం చేసుకునే అవకాశం కల్పించారనే ఆరోపణలు రావడం.. కేఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదులు అందడంతో అధికారులు దీనిపై దృష్టి సారించారు. ఇక నుంచి వీధి వ్యాపారుల ప్రాంగణంలో ఓ లెక్క ప్రకారం వ్యాపారాలు జరగాలని, అర్హులైన వారు కుటుంబానికి ఒక్క దుకాణం మాత్రమే కేటాయించి ఈ ప్రాంగణంలో తమ వ్యాపారాన్ని నిర్వహించేలా చూడాలని నిర్ణయించారు.

ప్రక్షాళన దిశగా..

పాత బస్టాండ్ ఎదురుగా ఉన్న వీధి వ్యాపారుల ప్రాంగణాన్ని ప్రక్షాళన చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇక్కడ పారదర్శకంగా వ్యాపారం జరగడంతో పాటు అర్హులైన వారు మాత్రమే ఉండేలా చర్యలు తీసుకోవాలని, మార్కెట్ నిర్వహణ పక్కాగా ఉండాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య మెప్మా అధికారులను ఆదేశించారు. దీంతో గత కొన్ని రోజులుగా మెప్మా అధికారులు ఈ ప్రాంగణంలో ఎవరెవరు వ్యాపారాలు చేస్తున్నారనే వివరాలను ఆరా తీస్తున్నారు. అందరి నుంచి ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్‌లు సేకరించారు. మార్కెట్ ధర ప్రకారమే కూరగాయలను విక్రయించేలా ధరల పట్టికలను ఏర్పాటు చేయించారు.

దళారుల జోక్యం లేకుండా..

ఈ ప్రాంగణంలో పేదలకు దుకాణాలను కేటాయించేందుకు దళారులు వారి నుంచి నగదు వసూలు చేశారనే విమర్శలు ఉన్నాయి. కొందరు రాజకీయ నాయకులు జన్మదినాలు, పండగలకు వ్యాపారుల నుంచి మామూళ్లు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల మెప్మా అధికారుల ముందే ఓ మహిళ వ్యాపారి వేల రూపాయలు వసూలు చేశారని విమర్శలు చేసినట్లు సమాచారం. వీటన్నింటికి బ్రేకులు వేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కేఎంసీ కమిషనర్ సూచనలతో రెండు రోజుల్లో 220కు పైగా దుకాణాలు ఏర్పాటు చేసేలా అధికారులు మార్కింగ్ చేయనున్నారు.

అద్దె ప్రాతిపదికన..

ఇప్పటి వరకు కేఎంసీకి ఎలాంటి రుసుము చెల్లించకుండానే వీధి వ్యాపారులు తమ వ్యాపారాలను కొనసాగించారు. ఇక నుంచి ఈ ప్రాంగణంలో కొలతల ప్రకారం వ్యాపారులకు దుకాణాలను కేటాయించి, వాటికి నంబర్లు వేసి వారి నుంచి కేఎంసీ కొంత మొత్తంలో అద్దె వసూలు చేయనుంది. ఆదివారం మెప్మా అధికారులు వీధి వ్యాపారుల ప్రాంగణంలో వ్యాపారులతో సమావేశమై కేఎంసీ అధికారుల నిర్ణయాలను వినిపించారు. దీనికి వ్యాపారులు కూడా సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది.

హోమాలు.. అన్నదానాలు...

శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీల ఆధ్వర్యాన ప్రత్యేక హోమ పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు పంచారు.పలు మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంఅర్బన్: కవిరాజ్‌నగర్‌లో భక్తుల పూజలు



ఖమ్మంమామిళ్లగూడెం: 25వ డివిజన్‌లో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ గోళ్ల చంద్రకళ



ఖమ్మంమయూరిసెంటర్: బాలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన అన్నదానాన్ని ప్రారంభిస్తున్న మేయర్ నీరజ



కామేపల్లి: అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కమిటీ సభ్యులు



ఖమ్మంగాంధీచౌక్: త్రీటౌన్‌లో అన్నదానం చేస్తున్న బీఆర్‌ఎస్ నేత ఆర్జేసీ కృష్ణ, తదితరులు

మంత్రి తుమ్మల ప్రత్యేక పూజలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 32వ డివిజన్ పరిధిలో కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఆదివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు మంత్రికి ఆశీర్వచనాలు అందించి పూర్ణకుంభంతో సత్కరించారు. సాధు రమేష్‌రెడ్డి, ఎం.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న మంత్రి తుమ్మల

రూ.50 కోట్లతో అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న చైర్మన్ హనుమంతురావు

రఘునాథపాలెం: మండలంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో తాజాగా రూ.50 కోట్ల నిధులతో 108 అభివృద్ధి పనులకు సీఆర్‌ఆర్ గ్రాంట్ ద్వారా మంజూరైనట్లు కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. ఆదివారం మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, ఆత్మ కమిటీ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షుడు వాంకుడో దీపక్, నాయకులు వివరాలు వెల్లడించారు. మండలంతో పాటు నగరంలోని విలీన గ్రామాలైన అల్లీపురం, బాలపేట తదితర గ్రామాలకు బీటీ రోడ్లు, ఫార్మేషన్ రోడ్లు, సీసీ రోడ్ల నిర్మాణాలకు నిధులు కేటాయించారని, రెండు రోజుల్లో పనులు ప్రారంభమవుతాయన్నారు. అలాగే కేంద్రం నుంచి రూ.120 కోట్ల వ్యయంతో మండలంలో డ్రెయినేజ్ వ్యవస్థ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు దేవిసింగ్, రామ్మూర్తినాయక్, బండి వెంకన్న, మాజీ ఎంపీపీ లాలు, సిద్దిక్, బాతుల సుధాకర్, కొంటెముక్కల నాగేశ్వరరావు, బండి నాగేశ్వరరావు, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ బోయినపల్లి లక్ష్మణ్ గౌడ్, నాగులు మీర, తదితరులు పాల్గొన్నారు.

జీతాలు తగ్గించే జీఓలు రద్దు చేయాలి



ప్రదర్శన చేస్తున్న డైలీ వేజ్, ఔట్‌సోర్సింగ్ వర్కర్లు

ఖమ్మంమయూరిసెంటర్: గిరిజన సంక్షేమ శాఖ వసతిగృహాల్లో పని చేసే కార్మికుల వేతనాలు తగ్గించేందుకు తీసుకొచ్చిన జీఓ 64తో పాటు 527ను రద్దు చేయాలని డైలీ వేజ్ వర్కర్స్ యూనియన్ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బి.మధు, నాయకులు బి.నాగేశ్వరరావు, ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.బ్రహ్మచారి డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం ఖమ్మంలో డైలీ వేజ్, ఔట్‌సోర్సింగ్ వర్కర్లు భారీ ప్రదర్శన నిర్వహించి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికుల సమస్యల పరిష్కారానికి 18 రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న 10నెలల వేతనాలు చెల్లించకుండా పండగ సమయాన పస్తులు ఉంచుతుందని విమర్శించారు. డైలీ వేజ్ వర్కర్లకు టైం స్కేల్ అమలు చేయాలని, ఔట్‌సోర్సింగ్ వర్కర్లకు జీఓ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కార్మికులతో చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు తాళ్లూరి కృష్ణ, యూనియన్ జేఏసీ నాయకులు మంగీలాల్, అనంత రాములు, సేవియా, మోహన్, తాజుద్దీన్, మంగ, కౌసల్య, స్వరూప, జయ తదితరులు పాల్గొన్నారు.

'వెన్నముద్దల' సంబురాలు

బతుకమ్మ పండగలో భాగంగా ఎనిమిదవ రోజు ఆదివారం మహిళలు సంప్రదాయ పద్ధతుల్లో వెన్నముద్దల బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు బతుకమ్మలను పేర్చి పూజలు చేశాక ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం సమీప చెరువులు, వాగుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. – సాక్షినెట్‌వర్క్



ఖమ్మంగాంధీచౌక్: విజయ్‌నగర్ కాలనీ షిర్డీ సాయిబాబా మందిరంలో..



ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం డీసీసీ కార్యాలయ ప్రాంగణంలో..



ఖమ్మం: 12వ డివిజన్‌లోని రాధాకృష్ణనగర్‌లో బతుకమ్మ వేడుకలు



ఖమ్మం సహకారనగర్: టీఎన్జీవోస్ కార్యాలయంలో బతుకమ్మ ఆడుతున్న ఉద్యోగులు



ఖమ్మం సహకారనగర్: సర్వజ్ఞ పాఠశాలలో..



నేలకొండపల్లిలో అన్నదాన కార్యక్రమం

మెరిసిన తారలు..

హ్యాండ్‌లూమ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా అజయ్‌కుమార్



అజయ్‌కుమార్

నేలకొండపల్లి: మండలంలోని కోరట్లగూడేనికి చెందిన మాజీ సర్పంచ్ బచ్చలకూరి చిన్న మైసయ్య కుమారుడు అజయ్‌కుమార్ గ్రూప్–2లో హ్యాండ్‌లూమ్ విభాగంలో డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించాడు. బీటెక్ చదివి...ప్రభుత్వ ఉద్యోగం కోసం చేసిన తొలి ప్రయత్నంలోనే విజయం సాధించగా.. పలువురు అభినందించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఉద్యోగం సాధించినట్లు అజయ్ తెలిపారు.

అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా ఉజ్వల



మైసా ఉజ్వల

తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గ్రూప్–2 ద్వారా అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా(జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్)లో మండల కేంద్రానికి చెందిన మైసా సురేష్‌బాబు–వరలక్ష్మి దంపతుల కుమార్తె ఉజ్వల ఉద్యోగం పొందింది. ప్రస్తుతం ఖమ్మం కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఈమె కుటుంబసభ్యుల ప్రోత్సాహంతో విజయం సాధించినట్లు తెలిపారు.

మొన్న ఏటీఓ, నేడు ఎక్సైజ్ ఎస్సై..



రత్నేశ్వరనాయుడు

కామేపల్లి: వరుస ఉద్యోగాలను సాధిస్తూ ఔరా అనిపిస్తున్న కామేపల్లి మండలం గోవింద్రాల గ్రామానికి చెందిన గంగారపు సత్యనారాయణ–జ్యోతిర్మయి దంపతుల చిన్న కుమారుడు రత్నేశ్వరనాయుడు ప్రస్తుతం కమర్షియల్ టాక్స్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. మొన్న గ్రూప్–1 ఫలితాల్లో అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్(ఏటీఓ)గా ఎంపిక కాగా నిన్న(ఆదివారం) గ్రూప్–2 ఫలితాల్లో ఎక్సైజ్ ఎస్సైగా ఎంపికయ్యాడు. తాను సివిల్స్ సాధించే వరకూ పట్టు వీడనని రత్నేశ్వరనాయుడు వెల్లడించాడు.

డీఎస్పీగా బూడిదంపాడువాసి



సంజయ్, తల్లిదండ్రులను సన్మానిస్తున్న గ్రామస్తులు

రఘునాథపాలెం: గ్రూప్–1లో డీఎస్పీగా ఎంపికై సీఎం చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్న మండలంలోని బూడిదంపాడుకు చెందిన తుమ్మలపల్లి నరసింహారావు–ఉమాదేవి దంపతుల కుమారుడు తుమ్మలపల్లి సంజయ్‌ను ఆదివారం రైతువేదికలో గ్రామస్తులు సన్మానించారు. గ్రామంలో చిన్నపాటి హోటల్ నడుపుకుంటున్న సంజయ్ తల్లిదండ్రులను గ్రామస్తులు సన్మానించారు.

సహాయ ఎస్సీ అభివృద్ధి అధికారిగా అక్షయ్



అక్షయ్

రఘునాథపాలెం: మండలంలోని వి. వెంకటాయపాలెం ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న చలమల వెంకటేశ్వర్లు–రమాదేవి దంపతుల కుమారుడు అక్షయ్ గ్రూప్ 2లో సహాయ ఎస్సీ అభివృద్ధి అధికారిగా ఎంపికయ్యాడు. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో బీటెక్ పూర్తి చేసి పోటీ పరీక్షలపై సన్నద్ధమవుతున్నారు. ప్రస్తుతం యూపీఎస్సీ సివిల్స్‌కు శిక్షణ పొందుతున్నారు.

సంక్షిప్తంగా..

ఖానాపురంలో అభివృద్ధి శూన్యం..



కాలనీల్లో పాదయాత్ర చేస్తున్న సీపీఎం బృందం

ఖమ్మంఅర్బన్: ఖానాపురం హవేలీ పంచాయతీగా ఉన్న సమయానే అభివృద్ధి జరిగిందని, మున్సిపాలిటీలో విలీనం అయ్యాక అభివృద్ధి శూన్యమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం 7వ డివిజన్ ఖానాపురం హవేలీ పరిధిలోని టేకులపల్లి లక్ష్మీనగర్, శ్రీకృష్ణనగర్ ప్రాంతాల్లో స్థానిక సమస్యలను పరిశీలించేందుకు సీపీఎం పాదయాత్ర చేపట్టింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నేతలు మాట్లాడుతూ.. టేకులపల్లి, శ్రీకృష్ణనగర్, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో మట్టి రోడ్లను సీసీ రోడ్లుగా నిర్మించాలని, డ్రెయినేజీ, చెత్త నిర్వహణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, ఎన్నెస్పీ కెనాల్ 28వ నంబర్ వద్ద బ్రిడ్జి నిర్మించాలని, ఖానాపురం, టేకులపల్లి శ్మశానవాటికలను అభివృద్ధి చేయాలని, పశువైద్యశాలలో డాక్టర్లు, సిబ్బందిని నియమించాలని, ప్రభుత్వ హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, హవేలి కార్యదర్శి దొంగల తిరుపతిరావు, పిన్నింటి రమ్య, పోతురాజు వెంకటి, కత్తుల అమరావతి, ఎస్‌కె.హిమాం, గాలి అంజయ్య, జట్ల ఆనందరావు, తోట నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మనిషిని మహోన్నతుడిగా తీర్చిదిద్దేది విద్యే

ఖమ్మంమయూరిసెంటర్: సమాజంలో మనిషిని మహోన్నత వ్యక్తిగా తీర్చిదిద్దేది విద్య మాత్రమేనని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వంగూరి వెంకటేష్ అన్నారు. ఆదివారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యాన నిర్వహించిన సత్యసోధక్ సమాజ సదస్సులో ఆయన మాట్లాడారు. కుల చైతన్యం కాదు, కుల నిర్మూలన చైతన్యం కోసం ప్రతి ఒక్కరూ సత్యశోధక్ సమాజ్ స్ఫూర్తితో పోరాడుదామని పిలుపునిచ్చారు. మతం పేరుతో ప్రజలను విభజించే బీజేపీ–ఆర్‌ఎస్‌ఎస్ భావజాలంపై ప్రతిపక్ష పోరాటం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు తిప్పరపు లక్ష్మణ్, మహిళా నాయకురాలు కీర్తి, జిల్లా ఉపాధ్యక్షుడు వినయ్, సహాయ కార్యదర్శి యశ్వంత్, నాయకులు పృథ్వి, సందీప్, సురేష్, కార్తీక్, అన్వేష్, ప్రాణవ్, హరిచంద్ర, శ్రీకాంత్, నవీన్, నిఖిల్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

సన్మానాలు

ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడికి..

ఖమ్మం సహకారనగర్: జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీగా యాస రామారావు నియామకానికి కృషి చేసిన ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ సైదులును ఆదివారం ఎస్టీఎఫ్ కార్యాలయంలో ఖమ్మం జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల బృందం ఘనంగా సన్మానించారు. ఈ నియామకంపై ఇటీవల అదనపు కలెక్టర్, డీఈఓలకు సైదులు విన్నవించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి గండు యాదగిరి, మన్సూర్, పి.వెంకన్న, షేక్ నాగుల్ మీరా, భాగ్య, మంద ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక వేత్తకు

సామాజిక, ఆధ్యాత్మిక సేవలకు ఆదర్శంగా నిలిచిన జెట్టి శ్రీకృష్ణ తులసీదాస్‌ను ఆదివారం నగరంలోని కృషిభవన్‌లో విశ్రాంత పోలీసు శాఖ అడ్మినిస్ట్రేషన్ అధికారి జి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్‌జీపీఏటీ) జిల్లా అధ్యక్షుడు పరిశపుల్లయ్య, విశ్రాంత పోలీసు సంఘం నాయకులు వెంకటనారాయణ, ఎస్‌జీపీఏటీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్, విశ్రాంత పోలీసు అధికారులు రామబ్రహ్మాచారి, జనార్దన్, చలపతిరావు, అక్తరున్నీసాబేగం, వెంకటనర్సమ్మ, బెల్లం రాధాకృష్ణ, కోట్యా, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి వాసవీ క్లబ్ కృషి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శ్రీనివాస్, తదితరులు

ఖమ్మంగాంధీచౌక్: పేద వర్గాల అభ్యున్నతికి వాసవీ క్లబ్ కృషి చేస్తుందని క్లబ్ అంతర్జాతీయ అడ్మినిస్ట్రేటివ్ ఉపాధ్యక్షుడు కడవెండి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సంస్థ ఉమ్మడి ఖమ్మం జిల్లా త్రీ రీజియన్ చైర్మన్ కొత్తూరు రమేష్ అధ్యక్షతన జరిగిన సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించాక మాట్లాడారు. వాసవీ క్లబ్ పేద వర్గాల విద్య, వైద్యం, ఆరోగ్యం, సంక్షేమం వంటి అంశాలపై ప్రధానంగా దృష్టి సారించి కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. అనంతరం క్లబ్ సేవలకు గుర్తింపుగా పలువురికి /జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు పల్లపోతు శ్రీనివాస్, గోళ్ల రాధాకృష్ణమూర్తి, వరప్రసాద్, గుంటుపల్లి దివాకర్‌గుప్తా, కొదుమూరి జగన్నాథం, పులిపాటి ప్రసాద్, వేమిశెట్టి మోహన్‌దాస్, బూర్ల పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

విప్లవవీరుడు భగత్‌సింగ్..

భారత స్వాతంత్ర్య సంగ్రామంలో బ్రిటీష్ పాలకలను గడగడలాడించి, భారత యువత, విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచిన విప్లవవీరుడు సర్దార్ భగత్‌సింగ్ అని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. దేశంతో మత చాందసవాద విధానాలు, సామ్రాజ్య వాద దోపిడీపై తిరుగుబాటు చేసేందుకు ఆయన త్యాగాన్ని స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకు సాగాలని పిలుపునిస్తూ సేవలు కొనియాడారు. – సాక్షి నెట్‌వర్క్



ఖమ్మం మామిళ్లగూడెం: డాక్టర్స్ మెడికల్ అకాడమీలో ఏఐఎస్‌ఎఫ్ నాయకుల నివాళి



ఖమ్మంమయూరిసెంటర్: సీపీఐ జిల్లా కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఏఐవైఎఫ్ నేతలు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

జి. శ్రీనివాస్, ACM - 70754 60585 రమేష్, ACO-9059115968
ఖమ్మం ఎస్.ఉపేందర్ - 99591 24151 వైరా ఐ. రాందాస్ - 98898 8184
పాలేరు ఎం. రామకృష్ణ - 85220 39990 సత్తుపల్లి జి. బాబు - 79979 58225
టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

ఎన్. శేషయ్య - 99121 99148
జి. నర్సింహారెడ్డి - 97054 44181
ఎస్.కె. పాషా - 97054 44182
పి. నందకుమార్ - 90102 99957